క్లుప్తంగా

'ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0'కు స్పందన

నెహ్రూనగర్: ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0లో నగరంలోని విద్యార్థులు పెద్దఎత్తున భాగస్వాములు కావడం అభినందనీయమని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ -2023లో భాగంగా నిర్వహిస్తున్న ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 సెల్ఫీ కార్యక్రమాన్ని శుక్రవారం నగరంలోని పలు విద్యా సంస్థల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియన్ స్వచ్ఛ లీగ్‌లో నగర ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, సెల్ఫీ దిగి అప్‌లోడ్ చేస్తూ, నగరానికి జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంక్ తీసుకురావడానికి భాగస్వాములు అవుతున్నారని ఆమె పేర్కొన్నారు. వార్డు సచివాలయాల వారీగా కార్యదర్శులు, నోడల్ అధికారులు, డెప్యూటీ కమిషనర్లు తమ పరిధిలోని విద్యా సంస్థలు, వాకింగ్ ట్రాక్‌ల్లో విద్యార్థులు, ప్రజలకు స్వచ్ఛ లీగ్‌పై అవగాహన కలిగిస్తున్నారని వివరించారు. ఈ సెల్ఫీ క్యాంపెయిన్ శని, ఆదివారం కూడా జరుగుతుందని ఆమె వెల్లడించారు. బీఆర్ స్టేడియంలో ఆదివారం జరిగే మెగా సెల్ఫీ కార్యక్రమంలో కూడా విద్యార్థులు, యువత పాల్గొని, గుంటూరు నగర ఖ్యాతిని జాతీయ స్థాయిలో మరోసారి చాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు.

'రజకులను కించపరిస్తే సహించేది లేదు'

నెహ్రూనగర్: కులవృత్తిపై ఆధారపడి జీవించే ర జకుల్ని ఉద్దేశపూర్వకంగా, కించపరిచేలా వ్యాఖ్య లు చేస్తే సహించేది లేదని జాతీయ ధోబీ మహా సంఘ్ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. అమరావతి రోడ్డులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ మాజీ సీఎం చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ బెంగుళూరులో టీడీపీ నేతలు చేపట్టిన దీక్షలో ఓ మహిళా నాయకురాలు రజకులను కించపరుస్తూ, తమ మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

ఘనంగా రంగస్థల నటుడు 'ములుగు' జయంతి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శ్రీ అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రముఖ రంగస్థల నటుడు ములుగు వీరభద్రరావు శత జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు రంగస్థల నటుడు చెరుకూరి సాంబశివరావు అధ్యక్షత వహించారు. రంగస్థల నటుడు జయశంకర్‌ను ఘనంగా సత్కరించారు. 16మంది కళాకారులకు ఆర్థిక సాయం అందించారు. అనంతరం శ్రీ సద్గురు కళానిలయం ఆధ్వర్యంలో ప్రదర్శించిన కమనీయం నాటకం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. మునిపల్లి విద్యాధర్ రచనకు, జయశంకర్ దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, రంగస్థల నటులు కావూరి సత్యనారాయణ, కె. శ్యాంప్రసాద్, టి. మధు, నడింపల్లి హనుమంతరావు, అమృత, జి. లహరి, విజయదుర్గ, ములుగు వెంకటేశ్వరరావు, ఉషారాణి పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులు

తెనాలి అర్బన్: ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులని మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ పేర్కొన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో చినరావూరు పార్కులో శుక్రవారం దోమల వ్యాప్తిని నియంత్రించేందుకు ఆయిల్ బాల్స్ వేశారు. అనంతరం దోమకాటు వల్ల వచ్చే వ్యాధులకు సంబంధించిన కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ దోమ కాటు వలన విషజ్వరాలు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం వాకర్స్‌కు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల, అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, తెనాలి సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, హార్టికల్చరల్ అధికారి శేషుబాబు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై మున్సిపల్ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

తెనాలి: స్వచ్ఛతా పక్వాడ్ రెండు వారాల కార్యక్రమంలో ఆఖరి రోజైన శుక్రవారం స్థానిక అయితానగర్‌లోని ఎన్‌ఎస్‌ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గాంధీ చౌక్‌లో 'నూకడ్ నాటక్ ' ప్రదర్శించారు. ప్లకార్డులు, ప్రదర్శనలతో ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. శుభ్రత, పరిశుభ్రత, ఆరోగ్యం, ఆనందం, నీటి పొదుపు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నివారణ, తడి చెత్త, పొడి చెత్త విభజనతో కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. దివ్యాంగులకు సానుభూతితో సహాయకులుగా ఉండాలని తమ ప్రదర్శనలతో చాటారు. పాఠశాల చిత్రకళా ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ శిక్షణతో ప్రదర్శించిన ఈ కార్యక్రమాన్ని రాజకిశోర్ పర్యవేక్షించారు. స్వచ్ఛతా పక్వాడ్ కార్యక్రమాల్లో విజేతలకు శనివారం బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు.

మనిషి మనుగడ సాంకేతికతతో ముడిపడి ఉంది

ఘనంగా ఇంజనీర్స్‌డే

గుంటూరు రూరల్: అద్భుతాల సృష్టికర్త సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఇంజనీరింగ్ విద్యార్థులు వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఇంజనీర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్భుతాలను సృష్టించగలిగేది ఇంజనీరింగ్ విద్యార్థులేనని తెలిపారు. టెక్నాలజీ దిశగా ప్రపంచదేశాలు పరుగెడుతున్న తరుణంలో విద్యార్థులు తమ మేధాసంపదను భారతదేశానికి అంకితం చేసి ఆర్థిక పురోగతిలో భాగస్వాములవ్వాలని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ సూచించారు. ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మనిషి మనుగడ టెక్నాలజీపైనే ఆధారపడి ఉందని సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేసి నిరంతరం పరిశోధనలు కొనసాగించాలని కోరారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఇంజనీర్స్‌డే వుడుకలను జరుపుకోవటం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన టెక్నికల్ ఎగ్జిబిషన్ ఆహుతులను ఆకట్టుకుంది. ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



టెక్నికల్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు, కళాశాల యాజమాన్యం

కిట్స్ కళాశాలలో ఇంజనీర్స్‌డే వేడుకలు

గుంటూరు రూరల్: ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థి మోక్షగుండం విశ్వేశ్వరయ్యను మార్గదర్శకంగా తీసుకుని నూతన ఆవిష్కరణల దిశగా కృషిచేయాలని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. శుక్రవారం వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలోని కళాశాలలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా ఎంతటి అద్భుతాలనైనా సృష్టించవచ్చని వివరించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ఇన్నోవేషన్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్ యువర్ డెస్టిని జర్నీ ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండర్ లీడర్ షిప్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ బాబు, డైరెక్టర్ డాక్టర్ కే హరిబాబు, మహమ్మద్ జాన్‌సైదా తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను పెంపొందించుకోవాలి

గుంటూరు రూరల్: విద్యార్థులు విలువలతో కూడిన విద్యను పెంపొందించుకుని నూతన ఆవిష్కరణల దిశగా సమాజాభివృద్ధికి కృషిచేయాలని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎమ్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం లాం కళాశాలలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రస్తుతం పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ప్రచారక్ జి.గౌతమ్ మాట్లాడుతూ ఏ దేశ ఆర్థిక వ్యవస్థ అయినా ఇంజనీర్లపై ఆధారపడి ఉంటుందని ఇంజనీర్లు దేశభవిష్యత్తుకు వెన్నెముక లాంటి వారని తెలిపారు. కె.పెదబాబు మాట్లాడుతూ నాణ్యమైన విద్యను ఆర్జించి విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసి సమాజాభివృద్ధికి దోహదపడాలని వివరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇంజనీర్స్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వి.రంగారావు, డాక్టర్ ఎ.రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.



ఇంజనీర్స్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం



ఇంజనీర్స్‌ను సన్మానిస్తున్న కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తదితరులు

ఇంటింటికీ సంక్షేమం

31వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. శుక్రవారం పొన్నూరు పట్టణంలోని 31వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. నవరత్న పథకాలతో తమ ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ మంచి చేసిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని లబ్ధిదారులు తమ పార్టీని ఆదరించాలని కోరారు. పట్టణంలో ఎన్నో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. పట్టణంలో ఎక్కడ ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి రాగానే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, బి.రంగారావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో మున్సిపల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు, సైడ్ డ్రెయిన్లు, భవనాల నిర్మాణం వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణ పరిధిలో జరగాల్సిన అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య

ఒకే పేరుతో ఉన్న ఓట్లను పరిశీలించాలి

నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఓటరు సర్వేను సక్రమంగా చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ఓటరు సర్వేపై నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఒకే పేరు (అక్షరాల మార్పు)తో పదుల సంఖ్యలో ఓట్లు ఉన్నాయని వాటిని గుర్తించి తొలగించాలని అధికారులకు సూచించారు. ఓటరు సర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. ఓటరు నమోదు అధికారి హరిహరనాథ్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీల నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని తెలిపారు. ఏమైనా సందేహాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అక్టోబరు 17వ తేదీలోగా ఓటరు సర్వే పూర్తి చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు తహసీల్దార్లు శ్రీకాంత్, గోపాలకృష్ణ, కమిషనర్ నయిం అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

జిజ్ఞాస, సమయపాలన విజయానికి సోపానాలు

విజ్ఞాన్‌లో ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శుక్రవారం మొదటి సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునే దిశగా సాగాలని, వైఫల్యాలను సైతం విజయానికి సోపానంగా మార్చుకోవాలని సూచించారు. జిజ్ఞాస, సమర్థ సమయపాలన, బుద్ధి స్థిరత్వం, వేగంగా సంగ్రహించుకోగలగడం ఇలా ఎన్నో అంశాలు మీ విజయాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. విద్యార్థులు పెద్ద పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని అందుకునేందుకు కష్టపడాలన్నారు. ఫ్రెషర్స్‌డే సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.



విద్యార్థినుల ప్రదర్శనలు

డీజేలకు అనుమతి లేదు

– ప్రత్తిపాడు ఎస్‌ఐ డి.రవీంద్రబాబు

ప్రత్తిపాడు: డీజేలకు పోలీస్ శాఖ ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదని, విగ్రహ కమిటీలు ముందస్తుగా డీజేలకు అడ్వాన్సులు ఇవ్వవద్దని ప్రత్తిపాడు ఎస్‌ఐ డి.రవీంద్రబాబు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషనులో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే వారు ముందుగా పోలీస్‌శాఖ నుండి కచ్చితంగా అనుమతి తీసుకోవాలన్నారు. గత ఏడాది జరిగిన అవాంఛనీయ ఘటనల దృష్ట్యా డీజేలకు అనుమతులు ఇవ్వకూడదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ శాఖ నిర్ణయించడం జరిగిందన్నారు. అదే విధంగా ముందస్తు అనుమతులు లేకుండా ఇతర ప్రాంతాల నుంచి డీజేల నిర్వాహకులు మండలానికి రావద్దని ఎస్‌ఐ సూచించారు. వస్తే కఠిన చర్యలకు ఉపక్రమించడం జరుగుతుందన్నారు. మండపాల వద్ద ఇసుక, నీళ్లు అందుబాటులో ఉంచడంతో పాటు విద్యుత్‌శాఖ అనుమతి తప్పనిసరన్నారు. నిమజ్జన కార్యక్రమాల్లో కమిటీలు ముందస్తు సూచనలు పాటించాలన్నారు. మందుగుండు సామగ్రి ఉపయోగించవద్దని చెప్పారు. తప్పెట్లు, మేళతాళాలతో సంప్రదాయబద్ధంగా అందరూ చూసి ఆనందించేలా జరుపుకోవాలని కోరారు. నిమజ్జన కార్యక్రమాల్లో, విగ్రహాల ఏర్పాటులో ఎవరైనా చట్ట, శాంతి భద్రతల ఉల్లంఘనలకు పాల్పడితే కేసులు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

ప్రజా ప్రతినిధుల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ప్రజా ప్రతినిధుల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలపై విభాగాధిపతులు వేగంగా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం నగర కార్పొరేటర్లు తమ వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్థానికంగా ఉండే ప్రజా ప్రతినిధులతో అధికారులు సమన్వయం చేసుకుంటే ప్రజల సమస్యల పరిష్కారం వేగంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి సోమవారం స్పందన, ప్రతి రోజు వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజా స్పందన నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు తనతో చర్చించడానికి ప్రత్యేక సమయం కావాలని కోరి ఉన్నందున ప్రతి శుక్రవారం దీనికి అవకాశం ఉందని తెలిపారు. మిగిలిన రోజుల్లో కూడా కార్పొరేటర్లకు అందుబాటులో ఉంటామని, వాట్సాప్‌లో తెలిపినా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు వారికి తెలపాలని అధికారుల్ని ఆదేశించారు. అనంతరం ఇటీవల స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరానికి జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్ వచ్చిన సందర్భంగా కమిషనర్‌ను డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, కార్పొరేటర్లు పూల బోకే అందించి, శాలువాతో అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తే ప్రజల సహకారంతో నగర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.



కార్పొరేటర్లతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

ఇళ్ల యజమానులకు టీడీఆర్ బాండ్లు పంపిణీ



పొన్నూరు: పొన్నూరులోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో శుక్రవారం రోడ్డు విస్తరణలో ఇల్లు నష్టపోయిన వారికి టీడీఆర్ బాండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొని ఇళ్ల యజమానులు పిడుగు వెంకట రామ్మూర్తి, అన్నవరపు నాగ వెంకట కృష్ణారావు, మద్ది మానసలక్ష్మీలకు టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశారు. విస్తరణలో 158 మంది భవన యజమానులు నష్టపోయారు. వారి ఇళ్ల మరమ్మతులకు గాను ఇప్పటివరకు 110 మందికి రూ. 2 కోట్ల70 లక్షలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. రోడ్డు విస్తరణలో ఇల్లు నష్టపోయిన వారిలో ఎవరూ నష్టపోకుండా అందరికీ న్యాయం జరిగేలా చేస్తానని హామీ ఇచ్చారు. మరో మూడు నెలల్లో పట్టణ మెయిన్ రోడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, నివాసితులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన

- జగనన్న ఆరోగ్య సురక్ష.. ఇంటింటికి ఆరోగ్య రక్ష
- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష అమలుకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. స్థానిక మున్సిపల్ సమావేశం హాలులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్షపై నిర్వహించిన అవగాహన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే కిలారి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని సురక్షితంగా ఉంచేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఉచిత ఆరోగ్య వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తారన్నారు. 27, 28 తేదీలలో రోగులను గుర్తించి వారికి 30వ తేదీ నుంచి గ్రామాల్లో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, డీపీఎంయూ రత్న మన్మోహన్, వైద్యులు, సీడీపీవో వెంకటరమణ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆకుల వారితోటలో నివసించే షేక్ రిజ్వాన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. నెల కిందట హార్డ్ స్పార్ యాప్‌లో సబ్‌క్రిప్షన్ చెల్లించాడు. తరువాత నెలలోనూ ఆటోమ్యాటిక్‌గా సబ్‌క్రిప్షన్ నగదు చెల్లింపులు జరిగాయి. దీంతో రిజ్వాన్ గూగుల్‌లో కస్టమర్ కేర్ నంబరు సెర్చ్ చేసి దానికి ఫోన్ చేశాడు. అవతల వారు కంప్యూటర్‌లో ఎనీ డెస్క్ ఓపెన్ చేయమని కోరగా, రిజ్వాన్ దాన్ని చేసి, అవతలవారు చెప్పిన సమాచారాన్ని అనుసరించాడు. అనంతరం రెండు విడతలుగా అతని అకౌంట్‌లోని రూ. 53వేలు విత్‌డ్రా అయ్యాయి. తాను మోసపోయినట్లు గుర్తించిన రిజ్వాన్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురిపై దాడి చేసిన యువకుడు

ముగ్గురిపై యువకుడు దాడి చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట 6వ లైనులో నివసించే సుభాని మటన్ షాపులో షఫ్రుద్దీన్ పని చేసేవాడు. అతడి వద్ద పనిమానేసి షఫ్రుద్దీన్ వేరే చోట చేరాడు. దీనిపై అతడ్ని సుభాని కొట్టి గాయపరిచాడు. ఇది మనస్సులో పెట్టుకున్న షఫ్రుద్దీన్ శుక్రవారం సుభాని ఇంటికి వెళ్లి అతడితో పాటు తండ్రి జిలాని, తల్లి హలీమాలను తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పు చెల్లించమన్నందుకు దూషణ

అప్పు చెల్లించమన్నందుకు దూషించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేటలోని ఓ సంస్థలో విజయలక్ష్మి, శ్రావ్య టెలీకాలర్లుగా పనిచేశారు. ఈ సమయంలో విజయలక్ష్మి వద్ద శ్రావ్య రూ. 80వేలు అప్పుగా తీసుకుంది. తర్వాత సంస్థలో పని చేయడం మానేసింది. విజయలక్ష్మి డబ్బులు అడగ్గా శ్రావ్య దూషించడంతో పాటు సెల్‌ఫోన్‌లో అసభ్యకర మెసేజ్‌లు పెట్టింది. దీంతో బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

వివాహిత కనిపించకుండా పోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ఏకనాథ్ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణనగర్‌కు చెందిన ఓ వివాహిత ఈనెల 12వ తేదీ ఇంటిలో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కారు చోరీ కేసులో నిందితుడ్ని నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్రం నల్గొండకు చెందిన పోలిశెట్టి కార్తిక్ ఈనెల 10న రిజర్వ్‌డ్ ఎస్‌ఐగా పనిచేసే మదన్‌మోహన్ ఇంటి తాళాలు పగులగొట్టి లోపలకు వెళ్లి కారు తాళాలు, సెల్‌ఫోన్ తీసుకున్నాడు. తర్వాత కారులో ఉడాయించాడు. మదన్‌మోహన్ ఫిర్యాదు మేరకు పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం కార్తిక్‌ను అరెస్టు చేసి సెల్‌ఫోన్, కారు స్వాధీనం చేసుకున్నారు.


బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

తెనాలి రూరల్: బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన తెనాలి సుల్తానాబాద్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. సుల్తానాబాద్‌కు చెందిన 50 ఏళ్ల జబర్‌లాల్ నాయక్ బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వైద్యశాలకు తరలించారు. జబర్‌లాల్ నాయక్ ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండగనాడు మట్టి విగ్రహాలనే పూజిద్దాం

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): మట్టి వినాయకుడి పూజతో ప్రజలంతా భక్తిశ్రద్ధలతో ఈ ఏడాది మొదటి పండుగ వినాయకచవితి జరుపుకోవాలని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మట్టి వినాయకుడిని పూజిద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం' అనే నినాదంతో మట్టి విగ్రహాల తయారీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ 2027 నాటికి ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించుకుందామని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపును బజరంగ్ ఫౌండేషన్ స్వాగతించి, సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని తెలిపారు. మట్టి గణపతిని పూజించాలంటూ పెద్దఎత్తున ప్రచారంతో పాటు ప్రతిమల పంపిణీని బజరంగ్ ఫౌండేషన్ గత ఏడాది నుంచి నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మట్టి వినాయకుల్ని పూజించి పర్యావరణానికి మేలు చేయాలని మురళీకృష్ణ సూచించారు. మట్టి విగ్రహాల నిమజ్జనం వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదని తెలిపారు. 17వ తేదీ సాయంత్రం నుంచి పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయం ఆవరణలో, పొన్నూరు మండలం మామిళ్లపల్లిలో ఐదు వేలకు పైగా మట్టి గణపతి ప్రతిమల పంపిణీని చేపడుతున్నట్లు వెల్లడించారు.



మట్టి వినాయక ప్రతిమలను పరిశీలిస్తున్న అంబటి మురళీకృష్ణ

ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీతకు సన్మానం

గుంటూరు రూరల్: తల్లిదండ్రుల తరువాత స్థానంలో విద్యార్థులకు మార్గదర్శకం చేసేది గురువని ఆ గురువు దేవుడితో సమానమని ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ మెట్టు రాజేశ్వరివెంకటప్పారెడ్డి, 27వ డివిజన్ కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మిలు తెలిపారు. శుక్రవారం నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు పొందిన సోషల్ టీచర్ గోడవర్తి పాపను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. విద్యా కాంతులతో పేదరికపు చీకట్లు తొలగుతాయన్నారు. ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత మాట్లాడుతూ ఈ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని రెట్టింపు ఉత్సాహంతో విద్యార్థుల ఉన్నతికి కృషిచేస్తానని పాప తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానప్రసూనాంబ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న కార్పొరేటర్, ఏఎంసీ చైర్‌పర్సన్

రేపు కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశం

తెనాలి: కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ, తెనాలి 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.2.50 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్టు చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు వెల్లడించారు. సొసైటీ షేర్ కాపిటల్ 1.96 కోట్లు, డిపాజిట్లు రూ.102.24 కోట్లు ఉండగా బంగారు ఆభరణాలు, స్థిరాస్తులపై రూ.97.87 కోట్ల రుణాలు ఇచ్చినట్టు తెలిపారు. స్థానిక కొత్తపేటలోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దావులూరి సోమశేఖరరావుతో 2001లో రెండు శాఖలతో ఆరంభమైన సొసైటీ, ఇప్పుడు తన హయాంలో తొమ్మిది శాఖలు నడుస్తున్నాయని తెలిపారు. తెనాలితోపాటు, కొల్లూరు, కొల్లిపర, గుంటూరు శాఖలు సొంత భవనాల్లో ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం పట్టణంలోని సొంత భవనంపై రెండో అంతస్తు నిర్మాణం జరుగుతోందని చెప్పారు.
బంగారు ఆభరణాలపై 11.5 శాతం, స్థిరాస్తులపై 15 శాతం వడ్డీకి రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. సొసైటీ 23వ వార్షిక సర్వసభ్య సమావేశం ఈనెల 17న తెనాలి ఎన్జీవో కల్యాణమండపంలో జరుగుతుందని, సభ్యులంతా హాజరుకావాలని కోరారు. సమావేశం అనంతరం శ్రీవెంకటలక్ష్మి దుర్గ నాట్యమండలి, తెనాలి వారి 'దేవనర్తకి' పద్య నాటకం ఉంటుందని వివరించారు.